క్లుప్తంగా

అంధుల ఆర్కెస్ట్రాకు వితరణ



వితరణ అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు

బలిజిపేట: స్వరమాధురి అంధుల ఆర్కెస్ట్రాకు రూ.12వేలను వితరణగా బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకట నాయుడు అందించారు. విశాఖకు చెందిన స్వరమాధురి అంధుల ఆర్కెస్ట్రా బృందం వారి విజ్ఞాపన మేర పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించి వారిని ప్రోత్సహించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.12వేలను బృందం సభ్యులకు అప్పగించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పర్యవేక్షణ



నారన్నాయుడువలస ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షిస్తున్న క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ

బలిజిపేట: మండలంలోని వంతరాం క్లస్టర్ పరిధిలో ఉన్న నారన్నాయుడువలస ప్రాథమిక పాఠశాలను క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఇంతవరకు పాఠ్యాంశాలు పూర్తయినవి లేనివి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వర్క్‌బుక్‌లను సరిచేస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించారు. విద్యార్థులను పిలిచి వారితో పాఠ్యాంశాలు చదివించి వారి నైపుణ్యాలను గుర్తించారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యను అందిచి వారి నైపుణ్యాలను మరింత పెంచేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బంగారు' తల్లులకు అభినందనలు



బంగారు పతక విజేతలతో పాటు కోచ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 14వ తేదీన విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీలో అస్మిత్ కిక్ బాక్సింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పార్వతీపురంలోని డీవీఎంఎం పాఠశాలకు చెందిన బి.రుత్విక, సాత్వికలు ప్రతిభ చాటారు. పోటీల్లో వారిద్దరూ స్వర్ణ పతకాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీధర్, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం డీవీఎం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడితో పాటు, ఉపాధ్యాయులు బంగారు పతక విజేతలతో పాటు కోచ్ సుంకర అనిల్ కుమార్‌ను అభినందించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలి

- ప్రభుత్వాన్ని కోరిన రైతులు



పండించిన పంటను చూపిస్తున్న మొక్కజొన్న రైతులు

పాచిపెంట: రైతు సేవా కేంద్రాల ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని, మండలంలోని కోడికాళ్ల వలస సమీపంలో రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను చూపిస్తూ ప్రభుత్వాన్ని మంగళవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో ఎరువులు అందక పంటలు పండే పరిస్థితి లేదని, ఉన్న పంటకు కనీస మద్దతుధర రూ.3వేలు ప్రకటించి కొనుగోలు చేయాలన్నారు. చాలావరకు పంటలు పూర్తిగా పాడైపోయాయని అలాంటి రైతులను గుర్తించి నష్టపరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఇప్పిలి రామారావు, బోను శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం సచివాలయాన్ని ఎంపీడీవో అర్జునరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే వాటిని పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రజల నుంచి సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కాలిబాటతో అధిక దిగుబడి

- వరిసాగులో ఖర్చు ఆదా
- సస్యరక్షణ సులభం



నారాయణపురంలో పంటపొలాల్లో కాలిబాటలు

బలిజిపేట: వరిసాగులో కాలిబాటలతో ఉభాలు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు చెబుతున్నారు. పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలియజేస్తున్నారు. చాలామంది రైతులు కాలిబాటలు వేయడానికి ఇష్టపడరు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తారు. రైతులు తప్పనిసరిగా వరిచేలలో కాలిబాటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం:

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపు వరకు సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్నచోట వాటిని నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలిబాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6నుంచి 7మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీంతో ప్రయోజనం సమకూరదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలను తీసివేసి కాటిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15నుంచి 20రోజుల వ్యవధిలో 20సెంటీమీటర్ల వెడల్పులో వరినాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.

ప్రయోజనాలు

కాలిబాటతో పైరు మొదళ్ల వరకు వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతాయి. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.

- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది.
- తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు ఉపయోగపడతాయి. తుఫాన్లు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంటచేల్లోని మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది.
- పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చేపట్టే వీలుకలుగుతుంది.

ఎంతో ప్రయోజనం

కాలిబాటలు వేయడం వల్ల పంట దిగుబడి పెరుగుతుంది. సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయి. వ్యవసాయ నిపుణుల సలహాలను రైతులు పాటించాలి.

శివగణేష్, ఏఓ, బలిజిపేట మండలం

వాహన మిత్ర రూ.20 వేలకు పెంచాలి



తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: రాష్ట్రంలో ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లను ఆదుకునేందుకు ఇస్తామన్న వాహన మిత్ర పథకం ద్వారా రూ.20 వేలు ఇవ్వాలని కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందిచాలని పాత నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉన్న డ్రైవర్లందరికీ సంక్షేమపథకాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు, మండల కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు దీర్ఘకాలంగా వాహనమిత్ర నిధులు మంజూరుచేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలపై వేస్తున్న అపరాధరుసుం పెంచే జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని వాహన మిత్ర దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈనెల 19 వరకూ పెంచాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసిన వారిలో సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

18న ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా ప్రచారపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.వేణు

సీతానగరం: ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఆఫీసుల ఎదుట 18న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లానాయకుడు రెడి వేణు కోరారు. ఈ మేరకు స్థానిక అజ్జాడ ఆటో స్టాండ్ ఎదుట ధర్నా పత్రికలను ఆటోడ్రైవర్లు, సీపీఎం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆటో డ్రైవర్లు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ అమలు చేయనందుకు నిరసనగా ఈ నెల 18న తహసీల్దార్ ఆఫీసుల ఎదుట ధర్నా చేయడానికి పిలుపు నిచ్చినట్లు తెలియ జేశారు. ధర్నా కార్యక్రమంలో మండలంలోని ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొవాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి జి. వెంకటరమణ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణికులు రాకపోకలు నిర్వహించక పోవడం వల్ల ఆర్థికంగా సమస్యలు ఎదుర్కోవలసి వస్తోందని, స్పేర్ పార్టుల ధరలు విపరీతంగా పెరిగాయని, కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు వై.ఈశ్వరరావు, ఇజ్జాడ నారాయణరావు, తోట శ్రీనివాస రావు, ఆర్. అప్పలనాయుడు, పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా వారాల పండుగలు



బుడ్డిపేటలో అమ్మవారితో తిరువీధి చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం వారాల పండుగలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని రైతులు ఖరీఫ్‌సీజన్‌లో ప్రారంభించిన వ్యవసాయ పనులు అమ్మవార్ల ఆశీస్సులతో నిర్విఘ్నంగా జరిగిన కారణంగా ఆదివారం, సోమ, మంగళవారాల్లో పండగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు మంగళవారం సుంకరివీధి, గూడెంవీధి, హడ్కోకాలనీ,బుడ్డిపేట, పెదభోగిలి గ్రామాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి అమ్మవారి ఘటాలతో ఊరేగింపు జరిగింది. ఆయాగ్రామాల ప్రజలు అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు చీరలు, పసుపు, కుంకుమలు మడపాలు, ప్రసాదాలతో గుడివరకూ పాదయాత్రగా వెళ్లారు. ఈ మేరకు పాత, కొత్త బుడ్డిపేట గ్రామాల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధుల పర్య వేక్షణలో అమ్మవారిని మేళతాళాలతో తిరువీధి చేశారు. అనంతరం భోగితల్లి గుడివరకూ ఊరేగిన తరువాత భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నీతి ఆయోగ్ బృందంతో మాజీ ఎమ్మెల్యే చర్చలు



నీతి ఆయోగ్ బృందంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: నీతి ఆయోగ్ ప్రతినిధుల బృందం మంగళవారం పార్వతీపురంలో పర్యటించి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పలు అంశాలపై ఆయనను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల అమలు, వాటి పనితీరు, ప్రగతి వంటి అంశాలపై మాజీ ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ మేరకు నియోజకవర్గ స్థితిగతులను మాజీ ఎమ్మెల్యే జోగారావు వారికి వివరిస్తూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు.

పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ సమావేశం

పార్వతీపురం రూరల్: ఎస్సీ సామాజిక వర్గాన్ని ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలని ఆలోచన చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో అర్బన్, గ్రామీణ ప్రాంతాల ఎస్సీసెల్ విభాగ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చిత్రశుద్ధితో ఎస్సీ వర్గాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థానంలో కూర్చోబెట్టిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డేనని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీ సామాజిక వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణగదొక్కుతూ దురుద్దేశంతో చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ విభాగ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ అన్ని విభాగాల నాయకులు పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు.

ఈవీఎంలు వద్దు-బ్యాలెట్ పేపర్‌తో ఓటింగ్ జరగాలి



మాట్లాడుతున్న పీఆర్‌శాఖ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రామకృష్ణ, శ్రీరాములునాయుడు

సీతానగరం: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు పేపరు బ్యాలెట్‌లతోనే నిర్వహించి ఈవీఎంలపై ప్రజల్లో ఉన్న అపోహలను ఎన్నికల కమిషన్ అధికారులు నివృత్తి చేయాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్‌వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లాఉపాధ్యక్షుడు బి శ్రీరాములునాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో గ్రామపంచాయతీలకు జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఈవీఎంలతోనే నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేయడంపై వారు మాట్లాడుతూ ప్రజల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలో ఓటింగ్ చేయడంతో వాటిలో లోపాలున్నట్లు అపోహలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన అవసరం ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ఈవీఎంలు వచ్చిన తరువాతనే కలహాలు, అన్నదమ్ముల్లా ఉన్న గ్రామాల్లో వైషమ్యాలను పెంచుతున్న ఈవీఎంలను పక్కకునెట్టి బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సీనియర్ సిటిజన్ ఆర్వీ పార్థసారథి, ఎంపీటీసీలు సింహాచలం, శంకరరావు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ ఎస్సీ కమ్యూనిటీ తలపెట్టిన విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని తన గృహంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ ఎస్సీ అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, పార్వతీపురంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మంటపం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశం ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చేపల వ్యర్థాలతో పర్యావరణ హిత ఎరువు తయారీ

పాచిపెంట: చేపల వ్యర్థాలతో పర్యావరణ హిత ఎరువు తయారవుతుందని వ్యవసాయ అధికారి తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మ వలసలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో చేపల వ్యర్థాలతో మీనా అమృతాన్ని తయారుచేయించారు. చేపల వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని పంటకు బలమైన ఆహారాన్ని అందించవచ్చన్నారు.

వీవోఏలకు కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి



పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీవోఏలు

పార్వతీపురం టౌన్: వీవోఏ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీదేవి, కె.ధర్మరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీ వెలుగు వీఓఏల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు ఉద్యోగులకు భద్రత కల్పించాలని హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని కోరారు. వీవోఏల 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. మెప్మాలో ఈ సర్క్యులర్ ను రద్దు చేశారని, అదేరకంగా వెలుగు సెర్ప్‌లో కూడా రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో 19 మంది వీవోఏలను తొలగించడం అన్యాయమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. వీవోఏల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా వీవోఏలందరూ ఐక్యమై ఉద్యమించాలని కోరారు. అనంతరం వెలుగు ఏపీడీ జైశ్రీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాల నుంచి హాజరైన వీవోఏలు హెచ్ మధు, శేషగిరిరావు రవి విజయ్ కుమార్ గౌరీశ్వరి సహ కార్యదర్శి సుందర్ రావు, దేవి. ఉపాధ్యక్షులు డి.అరుణ విజయ్ కుమార్, చంద్రకళ, వీవోఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'తల్లీబిడ్డ' సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు

పార్వతీపురంటౌన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో పనిచేస్తున్న కెప్టెన్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, దేవిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఎంతో శ్రమకోర్చి పనిచేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఎంప్లాయీస్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్సర్వీసులను నిర్వహించి వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో 102 సర్వీసులలో పనిచేస్తున్న వారిని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ,102 యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షులు వాసు, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అహ్లాదకర వాతావరణం ఉండాలి

- జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి



రావికోన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్న జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రతి పాఠశాలలో ఆవరణను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు మౌలిక వసతుల లోటులేకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి ఉపాధ్యాయులు సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ క్రమంలో విద్యార్థులతో సంభాషించి పుస్తకాలను తనిఖీ చేసి విద్యాప్రమాణాలు మరింత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

అలాగే మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. సిబ్బంది రిజిస్టర్లు, ఓపీల వివరాలు, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే పంపిణీ చేస్తున్న మందులపై ఆరా తీశారు. ఈ మేరకు వైద్యాధికారులు, సిబ్బంది రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి స్టాక్ రిజిస్టర్లు, యాప్‌లోని రికార్డులను సమీక్షించి యాప్ వినియోగాన్ని స్వయంగా తెలుసుకున్నారు. ఈ పర్యటనలో వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

- యూటీఎఫ్ డిమాండ్



సీతానగరం: జీపు జాతాలో మాట్లాడుతున్న కె విజయగౌరి

పార్వతీపురం టౌన్: విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లాలో మంగళవారం రణభేరి పేరిట ప్రచార జాతా నిర్వహించింది. సీతంపేటలో ప్రారంభమైన ఈ జాతా నీలకంఠాపురం, కురుపాం మీదుగా పార్వతీపురం చేరుకుని కొత్తవలస ఫ్లైఓవర్ నుంచి రణభేరి ప్రచార రథంతో పాటు ఉపాధ్యాయులు చర్చి జంక్షన్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించడంలోను, ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలతో సతమతమతుతున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు, పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కర రావు, అధ్యక్షుడు టి.రమేష్, జిల్లా సహాధ్యక్షురాలు వి.జ్యోతి, జిల్లా కోశాధికారి కె మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, ఎం. పైడిరాజు, కె గోవిందమ్మ, పి.వెంకటినాయుడు అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్:రణభేరి పేరిట ప్రచార జాతా నిర్వహించిన యూటీఎఫ్



సాలూరు పట్టణంలో యూటీఎఫ్ రణభేరి కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టండి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం డివిజన్‌లో గాడి తప్పిన రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఛైర్మన్ వంగల దాలి నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ ఆర్. వైశాలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేలాదిమంది భూ సమస్యలతో సతమతమవుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రైతుల బాధలు వర్ణనాతీతమని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తే అసలైన సమస్యలు దృష్టికి వస్తాయన్నారు. సామాన్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఛైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మయోగి కార్యక్రమంపై అవగాహన

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ, అనసభద్ర గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఆదికర్మయోగి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మర్రి పారమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సమస్యలు గుర్తించి, అభివృద్ధి ప్రణాళిక తయారుచేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.